Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్: 9440815774

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 87 | Tuesday 04.03.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 87 | మంగళవారం 04. 03. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

## ఇంధన భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం...

# దృఢనిశ్చయంతో ఉంది

తిరుపతిలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

తిరుపతిలో హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటు చేసిన హీరో ఫ్యూచర్ ఎనర్జీస్

రూ.1000 కోట్ల పెట్టుబడి, 2 వేల మందికి ఉపాధి

ఏడాదికి 25 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యం

వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



తిరుపతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** తిరుపతిలోని రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్‌లో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లి నివాసం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ చేపట్టిన ఈ ప్రాజెక్ట్... పారిశ్రామిక అవసరాల కోసం పీఎన్జీ, ఎల్పీజీతో గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్‌కు సరికొత్త విధానాన్ని అనుసరిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సాంకేతికత కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుందని, భారతదేశ శక్తి పరివర్తనకు కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తుందని వివరించారు. తిరుపతిలో ప్రవేశపెట్టిన స్కేలబుల్ మోడల్‌ను ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇంకా దేశవ్యాప్తంగా ఇతర పరిశ్రమల్లోనూ అనుకరించవచ్చని చెప్పారు. ఈ మిగతా 2 లో

## కూటమి నేతలకు వడ్డీతో సహా...

# చెల్లిస్తాం : రోజా



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** సినీ నటుడు పోసా ని కృష్ణమురళిని అరెస్ట్ చేయడం దారుణమని వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా అన్నారు. ఎప్పుడో ఆరేళ్ల క్రితం మాట్లాడితే... మనోభావాలు దెబ్బతిన్నాయని ఇప్పుడు అరెస్ట్ చేశారని మండిపడ్డారు. అన్యాయంగా బీఎన్ఎస్ 111 సెక్షన్ కింద కేసు పెట్టి అక్రమంగా ఇరికించారని విమర్శించారు. ప్రధాని మోదీ వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ గతంలో చంద్రబాబు, బాలకృష్ణ, లోకేశ్ మాట్లాడలేదా? అని ప్రశ్నించారు. వాళ్లపై ఇదే సెక్షన్ కింద కేసు నమోదు చేయగలరా? అని సవాల్ విసిరారు. వైసీపీ సాను మిగతా 2 లో

## చిరుధాన్యాల సాగుకే...

# అధిక ప్రాధాన్యత

: కేంద్ర మంత్రి భగీరథ చౌదరి




హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** వ్యవసాయ యూనివర్సిటీ, హైదరాబాద్ మార్చి 3 : చిరుధాన్యాల ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా ఎంతో డిమాండ్ ఉందని కేంద్ర వ్యవసాయ సహాయ శాఖ మంత్రి భగీరథ చౌదరి తెలిపారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు చిరుధాన్యాల సాగు వల్లే సాధించవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం నాడు జాతీయ చిరుధాన్యాల కిసాన్ మేళాను నిర్వహించారు. భారతీయ చిరుధాన్యాల సంస్థ ఐసీఏఆర్‌ఐఎన్‌ఆర్ ఎన్ ఆర్ సంచాలకులు తార సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి కేంద్రమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి భగీరథ చౌదరి మాట్లాడుతూ.. భారత్‌లో చిరుధాన్యాల సాగుకు వాతావరణ పరిస్థితులు, నేలలు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. కరోనా అనంతరం చిరుధాన్యాల ఉత్పత్తులకు అధిక డిమాండ్ పెరిగిందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో గల వివిధ రాష్ట్రాల నుంచి ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ సదస్సుకు హాజరు కావడం అభినందనీయమని కొనియాడారు. చిన్న కమతాలు ఉన్నాయని దిగులు చెందకుండా మిగతా 2 లో

## ఒక్క హామీ కూడా నెరవేర్చని అసమర్థ ముఖ్యమంత్రి...

# రేవంత్ రెడ్డి..

సబితా ఇంద్రారెడ్డి సెటైర్లు



బడంపేట, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చని అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 15 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. కల్యాణ లక్ష్మి డబ్బులు వస్తాయనే ఆశతో అప్పు చేసి ఆడపిల్ల పెళ్లి చేస్తున్నారని అన్నారు. సకాలంలో చెక్కులు అందజేయకపోవడంతో మిగతా 2 లో

## జగనన్న ఇళ్ల పథకం...

# పెద్ద కుంభకోణం

పేదలకు ఇళ్ల పట్టాలు.. మండలిలో వైసీపీపై మంత్రి అనగాని ఫైర్




అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఏపీ శాసనమండలిలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీపై వైసీపీ ఎమ్మెల్సీలు మిగతా 2 లో

## ప్రతి పాఠశాలలో ఈగల్ టీంలు...

# ఏర్పాటు చేస్తున్నాం

మెగా డీఎస్సీపై అసెంబ్లీలో మంత్రి లోకేశ్ ఏం చెప్పారంటే..



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఏపీ అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై సోమవారం చర్చ ప్రారంభమైంది. వివిధ కేటాయింపులు, సంక్షేమానికి నిధుల అంశాలపై చర్చిస్తున్నారు.సోమవారం సభ ముందుకు మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్ తీసుకురానుంది. సభలో మంత్రి నారాయణ ప్రవేశపెట్టనున్నారు. ఏపీ ఫిల్మ్ అండ్ టెలివిజన్‌పై వార్షిక నివేదికను సభలో మంత్రి కందుల దుర్గేష్ ప్రవేశపెట్టనున్నారు. పరిశ్రమలు, ఇంధన శాఖల వార్షిక నివేదికలను సభలో ముందు మంత్రులు టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్ ఉంచనున్నారు. ఈ సందర్భంగా ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి నారాలోకేష్ బడ్జెట్ పద్దులపై చర్చించారు. మెగా డీఎ మిగతా 2 లో




## ఏపీ ఎక్కువ నీటిని తీసుకోకుండా...

# అడ్డుకోవాలి : సీఎం

కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోంది

కేంద్రమంత్రితో పలు అంశాలను చర్చించామన్న ముఖ్యమంత్రి

బనకచర్లపై ఏపీ ప్రభుత్వం డీపీఆర్ ఇవ్వలేదన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, కేంద్రమంత్రితో మిగతా 2 లో

## నాకెప్పుడూ పదవుల మీద...

# వ్యామోహం లేదు



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఏపీ శాసనమండలి సమావేశాలలో సోమవారం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఓ అంశంలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతుండగా, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో అచ్చెన్నాయుడు స్పందిస్తూ... ఉండమ్మా, ఎవరైనా మాట్లాడొచ్చు... వాళ్లు, వీళ్లు మాత్రమే మిగతా 2 లో

# సంపాదకీయం

## నేరరాజకీయాలకు ఫుల్ స్టాప్ లేనట్టేనా

దొంగకే శిక్ష వెయ్యమని దొంగకే చెబితే ఎలా ఉంటుంది..? ఆలోచించండి! కేంద్ర ప్రభుత్వం ధోరణి కూడా అచ్చం అలాగే ఉంది. న్యాయం తన పని తాను చేసుకుపోతుందని చెప్పే ప్రభుత్వం.. రాజకీయ నేతల్లో నేరస్థుల అంశం మాత్రం కోర్టులకు కాదు.. రాజకీయ నాయకులకే వదిలేయమంటోంది. వారికి ఎంత శిక్ష వేయాలన్నది వారే నిర్ణయిస్తారని చెబుతోంది. ఏంటీ విడ్డూరం అనుకుంటున్నారా..? అవును, క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నేతలు.. రాజకీయ పదవులె చేపట్టకుండా, జీవితకాలం నిషేధించడం కఠిన చర్య అవుతుందట! ఇప్పుడున్న ఆరేళ్ల నిషేధం చాలు.. దాని కంటే ఎక్కువ శిక్ష వేయాలంటే అది పార్లమెంట్‌లో ఉన్న రాజకీయ నేతలకే వదిలేయమని మోడీ ప్రభుత్వం మొహమాటం లేకుండా చెబుతోంది. భారతదేశంలో నేరాలు, రాజకీయాలు ఎంతగా ముడిపడి ఉంటాయంటే? క్లీన్ పొలిటీషియన్‌ని భూతద్దంలో పెట్టి వెతకినా కనిపెట్టడం చాలా కష్టం. ప్రస్తుతం, చట్ట సభల్లో కూర్చున్న ప్రజాప్రతినిధుల్లో నేర చరిత్ర ఉన్నోళ్లు ఎంతమందో తెలిస్తే.. షాకవుతాం. అవినీతి, క్రిమినల్ కేసుల్లో దోషులుగా ఉన్నవాళ్లు చాలా మంది పార్లమెంట్, శాసనసభల్లో దర్జాగా కూర్చొని పాలన చేస్తున్నారు. వీళ్లందరి నేరాలూ కోర్టుల్లో రుజువైనా.. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయొచ్చు. అధికారం చేపట్టొచ్చు.. అజమాయిషీ చేయొచ్చు. ఇది కరెక్టేనా..? కేంద్ర ప్రభుత్వం తీరు చూస్తుంటే.. “అందులో ఏమంత పాపం ఉంది..? నిరభ్యంతరంగా దోషులు రాజకీయాల్లో ఉండొచ్చని” అన్నట్లుంది. వివిధ క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవితకాల నిషేధం చాలా కఠినమైన చర్య అని కేంద్రం భావించింది.ప్రస్తుత చట్టాల ప్రకారం ఆరు సంవత్సరాల అనర్హత కాలం చాలని కేంద్రం, సుప్రీంకోర్టుకు తెలియజేసింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవితకాల నిషేధం విధించాలని.. దేశంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులను త్వరగా పరిష్కరించాలని కోరుతూ.. న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణలో భాగంగా ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 8, సెక్షన్ 9 రాజ్యాంగ చెల్లుబాటుపై స్పందన తెలియజేయాలని కేంద్రంతో పాటు ఎన్నికల సంఘాన్ని ఈ నెల 10న సుప్రీంకోర్టు కోరింది. ఈ క్రమంలోనే కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. ఇందులో.. అనర్హత కాలాన్ని నిర్ణయించడం పూర్తిగా పార్లమెంటు పరిధిలో ఉంటుందని కేంద్రం పేర్కొంది.ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 8 (1) ప్రకారం, అనర్హత కాలం, దోషిగా తేలిన తేదీ నుండి ఆరు సంవత్సరాలు లేదా? జైలు శిక్ష విధించబడితే, విడుదల తేదీ నుండి ఆరు సంవత్సరాలు రాజకీయాల్లో పదవులు చేపట్టకుండా నిషేధం ఉంది. ఇక, సెక్షన్ 9 ప్రకారం, అవినీతి లేదా దేశ ద్రోహం కారణంగా తొలగించిన ప్రభుత్వ ఉద్యోగులను తొలగింపు తేదీ నుండి ఐదు సంవత్సరాల కాలానికి అనర్హులుగా ప్రకటిస్తారు. అయితే, ఈ రెండు సందర్భాలలోనూ అనర్హత కాలం జీవితాంతం ఉండాలని న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ కోరారు. అయితే, కేంద్రం సమర్పించిన న్యాయ సమీక్ష అఫిడవిట్‌లో.. శిక్షల ప్రభావాన్ని నిర్థిష్ట కాలానికి పరిమితం చేయడం రాజ్యాంగ విరుద్ధం కాదనీ.. ఇది ఇప్పటికే ఉన్న చట్టం ప్రకారం సబబేనని కేంద్రం పేర్కొంది.ఇక, పిటిషనర్ లేవనెత్తిన అంశాలు.. విపరీత పరిణామాలకు దారి తీస్తాయనీ.. నిజానికి, దీనిపై చివరి నిర్ణయం తీసుకోవడం పార్లమెంటు శాసన విధానం పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. అయితే, పార్లమెంట్ న్యాయ సమీక్షలో, సుప్రీంకోర్టు చట్టాలను రాజ్యాంగ విరుద్ధమైనవిగా కొట్టివేయొచ్చనీ.. కానీ, పిటిషనర్ కోరిన జీవితకాల నిషేధం సబబు కాదనీ కేంద్రం వాదించింది. దీనితో, ఈ అంశం న్యాయ వ్యవస్థకు సంబంధం లేదని పరోక్షంగా తేల్చిచెప్పింది కేంద్రం.ఇక, ప్రస్తుత చట్టాలు రాజ్యాంగపరంగా బలమైనవనీ.. అదనపు అధికార ప్రతినిధ్యం ఏమంత దుర్మార్గం కాదనీ కేంద్రం తన అఫిడవిట్‌లో వెల్లడించింది. అలాగే, దేశ రాజ్యాంగం.. ఇలాంటి అనర్హతలను నియంత్రించే మరిన్ని చట్టాలను రూపొందించడానికి పార్లమెంట్‌కు అవకాశం కల్పించినట్లు పేర్కొంది. ఇందులో భాగంగా? అనర్హతకు కారణాలు, అనర్హత వ్యవధిని నిర్ణయించే అధికారం పార్లమెంటుకు ఉందని తెలిపింది. లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభలు, శాసన మండలి సభ్యత్వానికి అనర్హతలను వివరించే.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 102, 191లను ఉటంకిస్తూ కేంద్రం తన అఫిడవిట్‌లో ఈ వాదనలు చేసింది.అయితే, ఏప్రిల్ 2013లో, సుప్రీంకోర్టు కనీసం రెండేళ్ల జైలు శిక్ష విధించబడిన ఎంపీలు, ఎమ్మెల్యేలను మూడు నెలల అప్పీల్ చేసుకునే అవకాశం లేకుండా వెంటనే సభ నుండి అనర్హులుగా ప్రకటిస్తామని తీర్పు చెప్పింది. కాగా.. నాడు, కేంద్రంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం దీనిని తోసిపుచ్చడానికి ఒక ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ చర్యను పూర్తిగా అర్థంలేనిదని అన్నారు. చివరికి ఆర్డినెన్స్‌ను రద్దు చేశారు.ప్రస్తుత నిబంధనల్లో? ప్రజాప్రతినిధ్య చట్టం ప్రకారం ఒక రాజకీయ నాయకుడు క్రిమినల్ కేసులో దోషిగా తేలితే ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధిస్తారు. ఆరేళ్ల తర్వాత తిరిగి ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం ఉంటుంది. నేరస్థులు రాజకీయాల్లో ఉండకూడదు ? పాలన స్వచ్ఛంగా ఉండాలంటే, క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలినవారిపై శాశ్వత నిషేధం ఉండాలి. ప్రజాస్వామ్యంలో నైతిక విలువలు కాపాడాలి ? రాజకీయ నాయకులు అనేవారు ఎలాంటి మచ్చ లేకుండా ఉండాలి. కేంద్రం సమర్పించిన అఫిడవిట్ తర్వాత.. ఇప్పుడు సుప్రీంకోర్టు దీనిపై తుది తీర్పు ఇవ్వాల్సి ఉంది. కాగా.. ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరిగే అవకాశముంది. ఇందులో, సరైన వాదోపవాదాలు జరిగితే.. రాజకీయ నాయకుల అర్హతలు, నిషేధ నిబంధనలపై భవిష్యత్‌లో మార్పులు వచ్చే అవకాశం కూడా ఉంది. కానీ, కేంద్రం దీనిపై స్పష్టంగానే తన అఫిడవిట్‌లో వివరణ ఇచ్చింది కాబట్టి, పార్లమెంట్‌లో చర్చకు వచ్చినా ఏ పార్టీ మార్పు చేయాలని అంగీకరిచకపోవచ్చు. ఎందుకంటే, పొలిటికల్‌గా ఎంత శత్రుత్వం ఉన్నా.. అల్టిమేట్‌గా అందరూ రాజకీయ నాయకులే..!నిజానికి, అవినీతిలో కూరుకుపోయిన రాజకీయాలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తున్నాయి. దేశవ్యాప్తంగా జరిగిన సర్వేలు ఈ కుళ్ళిపోయిన నిజాన్ని ఎప్పటి నుండో ఎత్తి చూపుతున్నాయి. ఆ మధ్య.. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులలో దాదాపు 33 శాతం మందిపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీళ్లపైన ఉన్న కొన్ని అభియోగాలు చిన్నవే అయినప్పటికీ.. 20 శాతం మంది ఎంపీల మీద హత్యాయత్నం, ప్రభుత్వ అధికారులపై దాడి, దొంగతనం వంటి తీవ్రమైన అభియోగాలు ఉన్నాయి.రాజకీయాల్లోకి ప్రవేశించడమంటే అవినీతికి పాల్పడడం అన్న అభిప్రాయం ఈ దేశంలో దాదాపు అందిరిలో ఉంది. ఏ ఎన్నికలు చూసుకున్న అధిక శాతం అభ్యర్థులు అయితే కోటీశ్వరులు, లేకపోతే నేరస్తులు. ఆర్థికబలం, అంగబలం లేనివాళ్ళు ఎన్నికల్లో గెలవరనే భావన పార్టీల్లోనే కాదు.. ప్రజల్లో కూడా బలంగా నాటుకుంది. ఆ బలాలు ఉన్న అభ్యర్థిని గ్యారెంటీగా ఏదో ఒక పార్టీవాళ్ళు లాగేసుకోవడం.. వాళ్లను గెలిపించేదాకా ప్రజల్ని ఆకర్షించడం అలవాటుగా మారింది. ప్రజలకు కూడా వేరే ఆప్షన్ లేకుండా పోయింది.నిష్పక్షపాతంగా ప్రభుత్వ విధానాలు అమలు కావు. నేరస్థులు నేతలైతే? ప్రభుత్వ ఉద్యోగుల సమగ్రతపై తీవ్రమైన ప్రభావం ఉంటుంది. ఇది సమాజంలో అవినీతిని పెంచుతుంది. ప్రభుత్వ ఉద్యోగుల పనితీరును ప్రభావితం చేస్తుంది.

# ఇంధన భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం...





వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ ఎండీ, చైర్మన్ రాహుల్ ముంజల్, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ గ్లోబల్ సీఈవో శ్రీవాత్సన్ అయ్యర్, రాక్‌మాన్ ఇండస్ట్రీస్ ఎండీ ఉజ్వల్ ముంజల్, రాక్‌మాన్ ఇండస్ట్రీస్ సీఈవో కౌసిక్ మన్నా, ఓహ్మియం సీఈవో ఆర్నే బాలంటైన్ పాల్గొన్నారు.

**లక్ష్యానికి తొలి అడుగు ఇది :**
స్వర్ణాంధ్ర విజన్–2047 సాధనలో పేర్కొన్నట్టుగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఏపీని ప్రపంచ కేంద్రంగా మార్చాలనే లక్ష్యానికి ఇది తొలి అడుగు అవుతుందన్నారు. రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద 160 గెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని, క్లీన్ ఎనర్జీలో రూ.10 ట్రిలియన్ పెట్టుబడిని సాధిస్తామనే విశ్వాసం ఉందన్నారు. శిలాజ ఇంధనాలపై ఆంధ్రప్రదేశ్ ఆధారపడటం తగ్గించడానికి, 2070 నాటికి భారతదేశం యొక్క నెట్–జీరో లక్ష్యానికి మద్దతు ఇవ్వడానికి, ముడి చమురు దిగుమతులను తగ్గించడానికి, ఇంధన భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అన్నారు. “గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌తో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ జైత్రయాత్ర మొదలు కావాలని కోరుకుంటున్నాను. రాష్ట్రంలో వాణిజ్యానికి ఉన్న అనుకూల విధానాలు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి హీరో ఫ్యూచర్ ఎనర్జీస్‌కు సహకారం అందిస్తాయి” అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ఎన్నో వనరులు...వినియోగించుకోండి :**
విస్తారమైన తీరప్రాంతం, లోతైన సముద్ర ఓడరేవులు, బలమైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌తో ఆంధ్రప్రదేశ్... దేశీయ, ప్రపంచ మార్కెట్ అవసరాలను తీర్చడానికి, గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతులకు కేంద్రంగా మారడానికి ఆంధ్రప్రదేశ్ అనువైందని ముఖ్యమంత్రి అన్నారు. రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో రెండు వేల మందికి ఉపాధి కల్పించేలా ప్లాంట్ నెలకొల్పడంతో తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని చెప్పారు.

**ప్రాజెక్టుతో ఎన్నో లాభాలు :**
రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ద్వారా రెండు వేల మందికి ఉపాధి కలుగుతుంది. ఏడాదికి 25 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తుంది. దీనిని ఏడాదికి 54 టన్నులకు పెంచుకునే అవకాశం ఉంది. ఏడాదికి 206 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాల తగ్గింపుతో పాటు, వాతావరణంలోకి ఏడాదికి 190 నుంచి 195 టన్నుల ఆక్సిజన్ విడుదల అవుతుంది. మొత్తమ్మీద 8 శాతం నుంచి 10 శాతం ఉద్గారాల తగ్గింపు సాధ్యమవుతుంది.

# జగనన్న ఇళ్ల పథకం...



రాజశేఖర్, హనుమంతురావు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానమిచ్చారు. అందరికీ ఇళ్ల పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలను అందజేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఇళ్ల పట్టాల కోసం 70,232 దరఖాస్తులు వచ్చాయన్నారు. గత ప్రభుత్వం సెంటు స్థలం మాత్రమే ఇవ్వగా కూటమి ప్రభుత్వం రెండు, మూడు సెంట్ల స్థలం ఇస్తోందని తెలిపారు. అంతేకాక ఇంటి నిర్మాణానికి 4 లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందిస్తోందన్నారు. జగనన్న ఇళ్ల పథకం పెద్ద కుంభకోణంలా మారిందని ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. లబ్దిదారుల ఎంపికలో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ధనవంతులు, ఉద్యోగులు, పార్టీ కార్యకర్తలు, అనుయాయులకు ఇళ్ల పట్టాలు పంచి పెట్టారని మండలిలో వెల్లడించారు. ఇళ్ల పట్టాల కోసం భూముల కొనుగోలులోనూ పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడ్డారని మంత్రి చెప్పారు. నివాసయోగ్యం కాని భూములను, స్మశానాలు, డంపింగ్ యార్డులు పక్కనున్న భూములను, వర్షం వస్తే మునిగిపోయే భూములను రెండింతలు, మూడింతలు అధిక ధరలకు ప్రభుత్వంతో కొనిపించారని దుయ్యబట్టారు. మొత్తం 10,500 కోట్ల రూపాయలతో 26 వేల ఎకరాల ప్రైవేట్ భూములను కొనుగోలు చేశారని.. ఇందులో నుండి వేల కోట్ల రూపాయలు వైసీపీ నేతలు, కార్యకర్తల జేబుల్లోకి వెళ్లాయని అన్నారు. కానీ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మాత్రం పేదలకు మేలు చేయాలనే లక్ష్యంతోనే అందరికీ ఇళ్ల పథకాన్ని చేపట్టిందని మంత్రి అనగాని సత్య ప్రసాద్ స్పష్టం చేశారు.

# ప్రతి పాఠశాలలో ఈగల్ టీంలు...



టీచర్ పోస్టుల భర్తీకి త్వరలో ప్రకటిస్తామని అన్నారు. ఏపీ వ్యాప్తంగా స్కూళ్ల ప్రహరీ గోడను పూర్తిచేయాలంటే రూ.3వేల కోట్లు అవుతుందని తెలిపారు. మనబడి మనభవిష్యత్తు, ఉపాధి హామీ కింద దశలవారీ చేపడుతామని అన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే క్యాంపెయిన్ ఈ ప్రభుత్వం చేపట్టిందని గుర్తుచేశారు. ప్రతి పాఠశాలలో ఈగల్ టీంలు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. అన్ని కాలేజీలకు, పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పేరెంట్ టీచర్ మీటింగ్‌లో స్టార్ రేటింగ్ ఆధారంగా మౌలిక సదుపాయాలు, మంచి విద్య అందించడంలో ప్రణాళికలు వేస్తున్నామని తెలిపారు. 117 జీవోతో నిరుపేదలకు విద్యను దూరం చేశారని మండిపడ్డారు. గత జగన్ ప్రభుత్వ నిర్వాకంతో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారని చెప్పారు. దీనికి ఓ ప్రత్యమ్నాయంపై సభ్యులతో చర్చించాలని నిర్ణయించామన్నారు. మధ్యాహ్నం ఓ సమావేశం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఇన్ కంప్లీట్‌గా ఉన్న పనులన్ని పూర్తిచేస్తామని చెప్పారు.117 జీవోకు ప్రత్యమ్నాయంగా తీసుకువచ్చే జీవో ఆధారంగా సభ్యుల సలహలతో ముందుకు వెళ్తామని అన్నారు. నాడు నేడుపై ఆరోపణలు వచ్చాయి ఇందులో నాణ్యత లేదన్నారని చెప్పారు. నాడు నేడుపై రిపోర్టు తీసుకుని యాక్షన్ తీసుకుంటామని అన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో 80 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అమలు చేస్తున్నామని తెలిపారు. సీసీ టీవీలు, లైటింగ్ పాఠశాలల వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. లెర్నింగ్ ఎక్స్ లెన్స్ ఆఫ్ ఏపీ కింద సీఎస్ఆర్ నిధులు తెచ్చి అభివృద్ధి చేయాలని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎలా అయితే సీఎస్ఆర్ ద్వారా అభివృద్ధి చేస్తున్నారో అలా మనం కూడా చేద్దామని చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో నాల్గో ప్రశ్నను వైసీపీ సభ్యులు అడిగారు. వారికి సమాధానం ఇస్తానని డిప్యూటీ స్పీకర్‌ను మంత్రి లోకేష్ అభ్యర్థించారు. టీవీలో అయినా సభ్యులు సమాధానం చూసుకుంటారని డిప్యూటీ స్పీకర్ తెలిపారు. టీవీలో చూడటం కాదు టీవీలు బద్దలు అవుతాయని మంత్రి నారా లోకేష్ విమర్శించారు.

# బెంగళూరు కేంద్రంగా వైసీపీ పాలిటిక్స్

విజయవాడ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ ::** ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీలో చేరికలకు అంతా సిద్ధమయినట్లు తెలిసింది. సీనియర్ నేతలు ఎక్కువ మంది వైసీపీ వైపు చూస్తున్నారు. ప్రధానంగా జగన్ కూడా తన కుటుంబ సభ్యులు రాజకీయంగా దూరం కావడంతో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితులుగా భావించే వారిని పార్టీలోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. అది ప్రజల్లో మంచి సంకేతాలను పంపుతుందని, తనకు నైతికంగా బలం పెరుగుతుందని విశ్వసిస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి పార్లమెంటు నియోజకవర్గాల సంఖ్య పెరగకపోయినప్పటికీ శాసనసభ స్థానాలు యాభై వరకూ పెరుగుతుండటంతో సీనియర్ నేతల అవసరాన్ని గుర్తించి వారిని పార్టీలోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కీలక సామాజికవర్గానికి చెందిన నేతలతో జగన్ టచ్‌లోకి వెళ్లినట్లు చెబుతున్నారు. కొందరు నేతలు నేరుగా బెంగళూరుకు వెళ్లి కలిసి వస్తున్నట్లు చెబుతున్నారు. పార్టీలో చేరితే ఖచ్చితంగా అధికారంలోకి రాగానే తగిన ప్రాధాన్యత ఉంటుందని ఈ సందర్భంగా జగన్ హామీ ఇస్తున్నట్లు సమాచారం. కొందరు సీనియర్ నేతలు రాజకీయాల పట్ల ఆసక్తి చూపకపోయినా, వారి వారసులను పార్టీలోకి తీసుకు వస్తే కొంత వరకూ ఫలితం ఉంటుందని అంచనాలు వేసుకుంటున్నారు. నియోజకవర్గాల వారీగా ఆయన బెంగళూరులోనే రివ్యూ చేసుకుంటూ ఆ నియోజకవర్గాల్లో బలమైన నేతలను పార్టీలోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్‌లో వైఎస్ కు సన్నిహితులుగా ఉన్న వారు ప్రస్తుతం ఆ పార్టీలోనే ఉన్నా వారు సంతృప్తికరంగా లేరు. ఇది గమనించిన వైఎస్ జగన్ తూర్పు గోదావరి జిల్లాలోని ఒక మాజీ కేంద్ర మంత్రిని సంప్రదించినట్లు సమాచారం. సామాజికవర్గంతో పాటు క్లీన్ ఇమేజ్ ఉన్న ఆ నేతను పార్టీలో చేర్చుకుంటే అతి పెద్దదైన తూర్పు గోదావరి జిల్లాలో పార్టీ మరింత బలపడే అవకాశముందని భావిస్తున్నారు. ఆయన కూడా తనకు ఎంపీ టిక్కెట్ కావాలని కోరగా, అందుకు జగన్ ఓకే చెప్పినట్లు తెలిసింది. ఇప్పటికే పార్టీలో చేరిన సాకే శైలజానాథ్ ద్వారా మరికొందరు కీలక నేతలను పార్టీలో చేరేలా రాయబారం నడుపుతున్నట్లు సమాచారం అందుతుంది. బెంగళూరు నుంచే అంతా రెడీ చేసుకున్న తర్వాత ఫైన్ డే వారికి కండువా కప్పేయాలని జగన్ ఆలోచనగా ఉందంటున్నారు. ఇక ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలను తీసుకురాగలిగితే తనను టార్గెట్ చేసిన సోదరి వైఎస్ షర్మిలకు కూడా చెక్ పెట్టవచ్చని జగన్ వ్యూహంగా ఉంది. కాంగ్రెస్ ఓటు బ్యాంకు ఇప్పటికే వైసీపీవైపు రావడంతో పాటు ఆ పార్టీ గత మూడు ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రాకపోవడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ తన పార్టీకి మొన్నటి ఎన్నికల్లో నలభై శాతం ఓట్లు వచ్చిన విషయాన్ని కూడా ప్రస్తావిస్తున్నట్లు తెలిసింది. అంతా సక్రమంగా జరిగితే జగన్ జిల్లాల పర్యటనలు ప్రారంభం అయ్యే ముందు పెద్దయెత్తున చేరికలు ఉంటాయని, అందుకోసం బెంగళూరు కేంద్రంగా భారీ ప్లాన్ ను జగన్ సిద్ధం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి చూడాలి ఎవరెవరు ఫ్యాన్ పార్టీ వైపు వస్తారన్నది. కానీ ఎన్నికలకు ఇంకా నాలుగేళ్లకు పైగానే సమయం ఉండటంతో ఇప్పుడే వస్తారా? మరికొంత కాలం వెయిట్ చేస్తారా? అన్నది చూడాలి.



# చిరుధాన్యాల సాగుకే...

చిరుధాన్యాల సాగు మంచిగా పండించి అధిక ఉత్పత్తిదారులకు ఎక్కువ ధరలకు చెల్లించే వారికే విక్రయించాలని ఆయన సూచించారు. చిరుధాన్యాల సాగుకు ప్రోత్సహించడం వల్ల పర్యావరణ పరిరక్షణ వేసవిలో సైతం వాతావరణంలో వచ్చే మార్పులను తట్టుకుని అధిక దిగుబడులు ఇస్తుందని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులకు చిరుధాన్యాల సాగు వరమని.. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అతి తక్కువ రసాయన ఎరువులు తప్పని పరిస్థితుల్లో వాడాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య అన్నారు. చిరుధాన్యాలకు జనాలు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం, అధిక ధరలు దేశవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంటుందని అన్నారు. తక్కువ వర్షపాత కాల ప్రాంతాల్లో కూడా చిరుధాన్యాలు పండుతాయని తెలిపారు. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు వికసిత్ భారత్‌లో భాగంగా చిరుధాన్యాల అధునాతన సాగు పద్ధతులు, ఉత్పత్తులు, పరిశ్రమల స్థాపనకు సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు.

# ఒక్క హామీ కూడా నెరవేర్చని ...

తల్లిదండ్రులు అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీ మేరకు కల్యాణ లక్ష్మీ డబ్బులతో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు మారడం లేదని ఆరోపించారు. ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉందని విమర్శించారు. ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని రేవంత్ సర్కార్‌కు సబితా ఇంద్రారెడ్డి సూచించారు. ప్రజాపాలనను గాలికి వదిలేశారని విమర్శించారు. రాష్ట్రమంతా సమస్యల సుడిగుండంలో ఉందన్నారు. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కూడా చేయలేని స్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉందని మండిపడ్డారు. మాటలు చెప్పుడు తప్ప చేతలు మాత్రం శూన్యమని అన్నారు. అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని తెలిపారు.? ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అర్తల కామేశ్ రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, సునీత బాలరాజ్, లలిత జగన్, నిర్మలారెడ్డి, అంజయ్య, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి నేతలకు వడ్డీతో సహా...

సాయం చేయవద్దని చంద్రబాబు చెప్పడం దారుణమని రోజా అన్నారు. వైసీపీ వాళ్లు కట్టే పన్నులను ప్రభుత్వం తీసుకోవడం లేదా? అని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఎదురు మాట్లాడినా, ఆయన తప్పులను ఎత్తిచూపినా సహించలేకపోతున్నారని... వాళ్లపై అక్రమ కేసులు పెట్టి జైళ్లలో వేస్తున్నారని చెప్పారు. అక్రమ కేసులతో రాష్ట్రాన్ని పాలిద్దామనుకుంటే... రేపు మళ్లీ అదే రిపీట్ అవుతుందని అన్నారు. జగన్ సీఎం అయిన తర్వాత కూటమి నేతలకు వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా చంద్రబాబు నెరవేర్చలేదని విమర్శించారు. మొన్నటి బడ్జెట్ తో ఇది మంచి ప్రభుత్వం కాదు, ముంచే ప్రభుత్వం అనే విషయం ప్రజలకు అర్థమయిందని అన్నారు.

# నాకెప్పుడూ పదవుల మీద...

మాట్లాడాలని లేదు... ఎవరైనా స్పందించి మాట్లాడొచ్చు... సమష్టి బాధ్యతతో మాట్లాడొచ్చు... మేం చెప్పింది తప్పయితే దానికి నువ్వు మాట్లాడాలి... మేం మాట్లాడకూడదు అంటే అది తప్పు అంటూ బదులిచ్చారు. అచ్చెన్న ఈ క్రమంలో బొత్సకు అదిరిపోయే కౌంటర్ ఇచ్చారు. “అధ్యక్షా... ఒక్క నిమిషం టైమ్ ఇవ్వండి అధ్యక్షా. గౌరవనీయ బొత్స సత్తిబాబు గారు నా గురించి వ్యక్తిగతంగా మాట్లాడారు. ఏదో ఎమ్మెల్యే అయ్యాడు, మంత్రి అయ్యాడు అంటూ మాట్లాడారు. నేను నిరంతరం ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తిని. మీలాగా గాలి వీస్తే గెలవడం, గాలి వీయకపోతే ఓడిపోవడం ఎప్పుడూ నా లైఫ్ లో లేదు. గాలి వీచినా, గాలి వీయకపోయినా... ఎలాంటి క్లిష్ట సమయంలో అయినా గెలిచే వ్యక్తిని నేను. నాకెప్పుడూ పదవుల మీద వ్యామోహం లేదు. పదవి ఉన్నా, పదవి లేకపోయినా నిరంతరం ప్రజల కోసం పనిచేసే తత్వం నాది” అంటూ అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కాగా, గత ఎన్నికల్లో బొత్స సత్యనారాయణ ఓటమిపాలైన సంగతి తెలిసిందే.

# ఏపీ ఎక్కువ నీటిని తీసుకోకుండా...




పలు అంశాలపై చర్చించినట్లు చెప్పారు. కృష్ణా బేసిన్ నుండి ఏపీ ఎక్కువ నీటిని తీసుకుంటోందని ఆరోపించారు. ఏపీ ఎక్కువ నీటిని తీసుకోకుండా అడ్డుకోవాలని కోరినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్లపై కూడా అభ్యంతరం తెలిపామని వెల్లడించారు. ఈ విషయంలో జోక్యం చేసుకుంటామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణకు సంబంధించి గోదావరిపై ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులు జరిగిన తర్వాతే ఏపీ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని కోరారు. కృష్ణా జలాల విషయంలో వచ్చిన సమస్యలే భవిష్యత్తులో గోదావరి జలాల విషయంలోనూ వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ ప్రభుత్వం చెప్పిన అభ్యంతరాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అప్పుడు కానీ అన్ని సమస్యలకు పరిష్కారం లభించదని అన్నారు.

**బనకచర్లపై ఏపీ ప్రభుత్వం డీపీఆర్ ఇవ్వలేదు: ఉత్తమ్ కుమార్ రెడ్డి**
బనకచర్లపై ఏపీ ప్రభుత్వం ఎలాంటి డీపీఆర్ ఇవ్వలేదని కేంద్రమంత్రి చెప్పారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేటాయింపుల పెంపు పైనా చర్చించినట్లు చెప్పారు. పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులకు కేంద్రాన్ని నిధులు అడిగినట్లు చెప్పారు. మొత్తం ఐదు ప్రాజెక్టులకు నిధులు అడిగామని మంత్రి తెలిపారు. టెలిమెట్రీలకు అవసరమైతే ఏపీ వాటాను కూడా భరిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

## రేణిగుంట విమానాశ్రయంలో .....
# ఎంపీని కలిసిన టిడిపి నాయకులు



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 03: చిత్తూరు ఎంపీ దగ్గు మల్ల ప్రసాద్ రావు ను రేణిగుంట విమానాశ్రయంలో మర్యాద పూర్వకంగా కలిసిన గంగాధర నెల్లూరు నియోజకవర్గ టిడిపి నాయకులు... తిరుపతిలో బ్యాంకర్స్ మీటింగ్ కు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు అనంతరం హైదరాబాద్ కు బయలుదేరారు అయితరేణిగుంట విమానాశ్రయానికి గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ టిడిపి నాయకులు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావును కలిసి కొంతసేపు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ సి ఆర్ రాజన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయచంద్ర నాయుడు సాఫ్ట్వేర్ బాలు జిల్లా టిడిపి నాయకులు రాజశేఖర్ నాయుడు,మాజీ సర్పంచ్ భాస్కర్ నాయుడు యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ తలారి రెడ్డప్ప బి వి నాయుడు బాలాజీ నాయుడు బ్రహ్మనాయుడు మాధవ నాయుడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మండలములో జిల్లా పరిషత్ నిధుల నుండి....
# త్రాగునీటి బార్లు.



వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి03: వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే కొన్ని గ్రామాలలో త్రాగునీటి సమస్యతలెత్తిన విషయం తెలుసు కున్న చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ జి శ్రీనివాసులు తమ జిల్లా పరిషత్ నిధులనుండి వెంటనే బోర్లు మంజూరు చేయించి ఎక్కడెక్కడ నీటి కొరత ఉన్నదో అధికారుల ద్వారా తెలుసుకొని అక్కడ వెంటనే త్రాగునీటి బోర్లు వేయాలని ఆదేశాలు జారీ చేయడంతో స్పందించిన అధికారులు వెంటనే జియాలజిస్టుల ద్వారా త్రాగునీటి బోర్లు పాయింట్లు పెట్టి ఈరోజు కొన్ని గ్రామాలలో త్రాగునీటి బోరు బావులు వేయించడం జరిగినది. దీనిపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేసినారు మరియు జిల్లా పరిషత్ చైర్మన్ కి కృతజ్ఞతలు తెలియజేసినారు.

## పేద విద్యార్థులకు అండగా ....
# తెలుగుదేశం పార్టీ ఉంటుంది.
## కృష్ణమ నాయుడు



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 03: పేద విద్యార్థులకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి కృష్ణం నాయుడు అన్నారు. గంగాధర్ నెల్లూరు మండలం వేల్కూరు గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు బుజ్జి కుమార్తె రమ్యకు ఉచితంగా ల్యాప్ టాప్ ను కృష్ణం నాయుడు అందించారు.బాగా చదువుకుని ఉన్న స్థితికి ఎదగాలని రమ్యను దీవించారు. ఈ కార్యక్రమంలో యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ టిడిపి నాయకుడు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ ఎమ్మెల్యే సహకారంతో ....
# త్రాగునీరు బోర్లు మంజూరు
## ఎంపీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసిన గ్రామస్తులు



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 03: గంగాధర్ నెల్లూరు మండలం నెల్లపల్లి పంచాయతీలో ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సహకారంతో జడ్పీ నిధులతో నెల్లెపల్లి పంచాయితీ చిన్న మిట్టపల్లి గ్రామంలో నూతన బోరు మోటారు పైపులైన్లు వేయడం జరిగింది అలాగే కొత్తూరు గ్రామంలో నూతన బోరు మోటరు త్రాగునీరు పైపులైన్లు వేయడం జరిగింది. అలాగే నెల్లెపల్లి గ్రామంలో నూతన బోరు మోటరు పైప్ లైన్లు వేయడం జరిగింది. మా గ్రామానికి త్రాగునీరు బోర్లను వెంటనే మంజూరు చేసిన ఎంపీ ఎమ్మెల్యేకు గ్రామస్తులు నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ సర్పంచ్ గంగయ్య మాజీ సర్పంచ్ పుష్పరాజ్ మాజీ ఎంపిటిసి సుబ్రహ్మణ్యం టి ఎన్ టి యు సి కార్యదర్శి దేవరాజుల నాయుడు మాజీ సర్పంచ్ వెంకటపతి రెడ్డి తుకారం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ అసెంబ్లీలో సత్యవేడు సమస్యలు పరిష్కారం కోరుతూ.....
# సభలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ఆదిమూలం
## సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ లకు ఎమ్మెల్యే వినతి.

వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మర్చి 03: సత్యవేడు నియోజకవర్గంలో రోడ్ల దుస్థితిని, స్మశానం సమస్యలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం ఏపీ అసెంబ్లీలో ప్రస్తావించారు.ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తన సత్యవేడు నియోజకవర్గంలో 36 రోడ్లు మంజూరు అయ్యిందన్నారు.ఎన్డిబి ద్వారా నాగలా పురం నుండి చిన్నపాండూరు వరకు రూ.40 కోట్లు, బుచ్చినాయుడు కండ్రిగ నుండి సూళ్లూరుపేట వరకు రూ.12 కోట్లు పనులు సైతం రామచంద్రారెడ్డి కాంట్రాక్టర్ దక్కించుకొని పనులు చేపట్టలేదని ఆరోపించారు. ఎస్సీ రిజర్వుడు నియోజక వర్గం అయిన సత్యవేడు తమిళనాడుకు సరిహద్దుగా ఉందని, తాను మండలాల్లో తిరగాలన్నా తమిళనాడు లోపల వెళ్లాల్సిం దేనని వాపోయారు. కరోనా సమయంలో తనను కూడా తమిళనాడు ప్రభుత్వం రాకపోకలకు అనుమతించలేదని, ప్రజలతో పాటు తాను కూడా తీవ్రంగా ఇబ్బంది పడినట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇందు కోసం దాసుకుపం బైపాస్ రోడ్డు నిర్మాణాని కి రూ.26 కోట్లు మంజూరు చేశారని, ప్రస్తుతం అది పరిశీలనలో ఉన్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. తన నియోజకవర్గంలో మొత్తం 36 రోడ్లను అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాంట్రాక్టు దక్కించుకొని కేవలం 6 రోడ్లను మాత్రం వేసి మిగిలిన వాటిని చేయకుండా వదిలేశారన్నారు. చివరికి రోడ్లు వేయకపోవడానికి కారణం తానేనని తనపై నెపం నెట్టి తనకు ఎమ్మెల్యే టికెట్ రాకుండా అడ్డుకున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో తనను దేవుడు లా ఆదుకొని, తనకు టికెట్టు కేటాయించి, ఎమ్మెల్యే చేసిన మహోన్నత వ్యక్తులు నారా చంద్రబాబు నాయుడు ,నారా లోకేష్ అంటూ ఎమ్మెల్యే భావోద్వేగానికి గురయ్యారు.ఇప్పుడిప్పుడే రోడ్లన్నింటికీ మరమ్మత్తులు జరుగుతున్నాయని, మంజూరు ఆగిపోయిన రోడ్లను కూడా నిర్మించాలని ఎమ్మెల్యే సభ దృష్టికి తెచ్చారు.అలాగే తమ నియోజకవర్గంలో స్మశానాలు, స్మశానాలకు రోడ్లు



లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం దయవుంచి తమ నియోజకవర్గంలోని స్మశానాలు, వాటికి అవసరమైన రోడ్లు నిర్మాణం చేపట్టి ఆదుకోవాలని ఎమ్మెల్యే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, మంత్రి నారాలోకేష్ కి వినతి పత్రం సమర్పించారు.

## బాలయోగి, ఉపాధి హామీ కౌన్సిల్ మెంబెర్ పోతుగంటి వీరయ్యలకు .....
# నివాళులు అర్పించిన గుత్తి త్యాగరాజు

వరదయ్యపాలెం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 03: మంగళగిరిలోని రాష్ట్ర టీడీపీ కార్యాలయం లో దివంగత లోక్ సభ స్పీకర్ జిఎంసి. బాలయోగి కి, ఉపాధిహామీ కౌన్సిల్ మెంబెర్ పోతుంగుంట వీరయ్య కు నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం ప్రజావేదిక కార్యక్రమం లో పాల్గొని, శ్రీకాళహస్తీ దేవాంగ వాహన మండపం లో... తొలగించిన దేవాంగా.. పేరు చేర్చడం పై ఇదివరకే ఇచ్చిన వినతి పత్రం పై ప్రస్తావించడం జరిగింది.తిరుపతి జిల్లా గాజులమండ్యం నుండి శ్రీసిటీ కి 4వే లైన్ రోడ్ నిర్మాణం కొఱకు 1,776 కోట్ల రూపాయలతో ప్రతిపాదన చేయడం పట్ల హర్షం తెలియజేయడమైనది.అదే విధంగా రేణిగుంట నుండి తడ వరకు శ్రీసిటీ మీదు గా రైల్వే లైన్ నిర్మాణం కొఱకు కేంద్ర ప్రభు త్వంను కొరవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వం ను కోరడమైనది.గిరిజన,హరిజనవాడ లలోని



ప్రాథమిక పాఠశాల విలీనంపై ఒక సారి అలోచించాలని కోరడమైనది. ఏపీఎం ఎస్ అండ్ ఐడీసీ చైర్మన్ చల్లపల్లి శ్రీనివాస రావు కార్యాలయంవద్ద వినతి పత్రం ఇవ్వడం జరిగింది.జనసేన నాయకుడు మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిని కలవడం జరిగింది. విజయవాడ 25 వ డివిజన్ జనసేన అధ్యక్షుడు జిడిగం శ్రీని వాస్ నుండి ఎన్డిఏ కూటమి మెమంటో ను గుత్తి త్యాగరాజు అందుకున్నారు. అనం తరం రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి మధు కర్ జి ని కలిసి మాట్లాడటం జరిగింది.

## ఘనంగా హీరో .....
# సి ఆర్ తేజ్ జన్మదిన వేడుకలు



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 03: తమిళ సినిమా హీరో సి ఆర్ తేజ్ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.. చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వన్య క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సి.ఆర్ రాజన్ కుమారుడు సినిమా హీరో సి ఆర్ తేజ్ జన్మదిన సందర్భంగా భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు అలాగే సినిమా హీరో సి ఆర్ తేజ్ ను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జె.చంద్ర నాయుడు సాఫ్ట్వేర్ బాలు మాజీ సర్పంచ్ భాస్కర్ నాయుడు బాలాజీ బివి నాయుడు పాల్గొన్నారు.

## ద్రావిడ విశ్వవిద్యాలయంలో శాస్త్రీయ,సాంకేతిక.....
# పరిభాష నిఘంటువుల నిర్మాణం కార్యశాల ప్రారంభం

గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 03: కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలం లోని ద్రావిడ విశ్వవిద్యాలయంలోని సంగ ణక, భాషాశాస్త్ర విభాగం రాజనీతి శాస్త్రం సంబంధించి తెలుగు, తమిళం మరియు కన్నడ పారిభాషా పదజాల నిఘంటువులు తయారు చేయడానికి ఈ నెల 3వ తేది నుండి 7వ తేది వరకు కార్యశాల నిర్వహి స్తున్నట్లు కార్యక్రమ సమన్వయ కర్త ఆచార్య ఎంసి కేశవ మూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ కమీషన్ ఫర్ సైంటిఫిక్ %a% టెక్నికల్ టెర్మినాలజీ – సి ఎస్ టి టి అన్ని భారతీయ భాషలలో సాంకేతిక పరిభాషను అభివృద్ధి చేసే లక్ష్యంతో భారతదేశంలో స్థాపించబడింది. ప్రస్తుతం, సి ఎస్ టి టి న్యూఢిల్లీలో ప్రధాన కార్యాల యంతో భారత ప్రభుత్వంలోని ఉన్నత విద్యా శాఖ, విద్యా మంత్రిత్వ శాఖ క్రింద పనిచేస్తోంది. ఇరవై రెండు రాష్ట్ర గ్రంథ అకాడెమీలు/రాష్ట్ర టెక్స్ట్–బుక్ బోర్డులు/ విశ్వవిద్యాలయాల శాఖలు మొదలైనవి కూడా ఈ కమిషన్‌తో అనుబంధించబడి.సి ఎస్ టి టి ద్వారా రూపొందించబడిన ప్రామాణిక పదజాలంతో హిందీ, ఇతర భారతీయ భాషలలో విశ్వవిద్యాలయ స్థాయి టెక్స్ట్–బుక్స్ / రిఫరెన్స్ మెటీరి యల్‌లను రూపొందించడానికి ఈ ప్రభుత్వ సంస్థ పూనుకుంది. ఇప్పటి వరకు, సి ఎస్ టి టివివిధ సబ్జెక్టులు మరియు వివిధ భాషలలో దాదాపు తొమ్మిది లక్షల సాంకే తిక పదాల పదజాలాన్ని ప్రామాణికం చేసింది. ఇది కాకుండా,సి ఎస్ టి టి పెద్ద సంఖ్యలో డెఫినిషనల్ డిక్షనరీలు,గ్లోసరీలు, టెక్స్ట్–బుక్స్,రిఫరెన్స్ మెటీరియల్స్,మోనోగ్రాఫ్‌లు, 'విజ్ఞాన్ గరిమా సింధు' మరియు 'జ్ఞాన్ గరిమా సింధు' అనే



త్రైమాసిక జర్నల్స్ మరియు ఇలాంటి స్వభావం గల అనేక ఇతర రచనలను ప్రచురించింది.సి ఎస్ టి టి వినియోగాన్ని పెంచడానికి, ప్రాచుర్యం పొందేందుకు సమావేశాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సింపోజియం, కాన్ఫరెన్స్‌లు, ఓరియంటేషన్ మరియు శిక్షణా కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తుంది. ఈ కార్యశాల ప్రారంభోత్స వానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య. ఎం.దొరస్వామి, కులసచివులు ఆచార్య వి. కిరణ్ కుమార్, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య కె.శ్యామల, డీన్ ఆచార్య ఎంఎన్ వెంకటేశ, ఆచార్య ఎంసీ కేశవ మూర్తి, శాఖాధ్యక్షులు ఆచార్య గణేశన్ అంబేద్కర్, సి ఎస్ టి టి డిప్యూటీ డైరెక్టర్ డా. మహ్మద్ అన్సారీ షెహజాద్, వివిధ భాషల నిపుణులు, రాజనీతి శాస్త్ర నిపుణులు పాల్గొన్నారు.


## మార్చి 14న జనసేన ఆవిర్భావ సభను.....
# విజయవంతం చేద్దాం
## జిల్లా కార్యదర్శి తడ శ్రీనివాసులు పిలుపు



వరదయ్యపాలెం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 03: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం ఏడు మండలాల్లో ఉన్న జనసేన నాయ కులు కార్యకర్తలు వీర మహిళలు ఈనెల 14వ తేదీన చిత్రాడ పిఠాపురం నియోజక వర్గం నందు జరగనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సభను జయప్రదం చేయాలని,ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తడ .శ్రీనివాసులు, కార్యకర్తల సమావేశంలో పిలుపునిచ్చారు . అనంతరం ఆయన మాట్లాడుతూ జన సేన,పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ స్థాపించి మార్చి 14 తేదీకి 12 సంవత్సరాలు అవుతుంది పార్టీ స్థాపించిన ప్పుడు నుంచి రాష్ట్రం కోసం రాష్ట్ర ప్రజల కోసం రాష్ట్రంలో ఉన్న సమస్యలు పై నిరం తరం కృషి చేస్తూ రాష్ట్ర భవిష్యత్తు కోసమే పనిచేస్తున్న పవన్ కళ్యాణ్ అడుగు జాడలు మనమందరం నడుస్తూ కలిసి కట్టుగా ముందుకు సాగుతూ ఆవిర్భావ నుండి అభివృద్ధి వరకు తోడుగా ఉన్న ప్రతి ఒక్కరు పాల్గొని ఈ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో,జనసేన నాయకులు, బాలమురళీ కృష్ణ, సుబ్రమణ్యం,విజయ్ కుమార్, రాఘు వేంద్రబాబు, సుగంధర్. కోదండరామయ్య, రమేష్,రెడ్డి,శేఖర్,శేఖర్,ఠాగూర్, వెంకటే శ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేటలోని శ్రీప్రసన్నపెద్దపల్లి గంగమ్మ షికారోత్సవం









కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మర్చి 03: కుప్పం పట్టణం కొత్తపేటలో వెలసిన శ్రీప్రసన్న పెద్దపల్లి గంగమాంబ అమ్మవారి షికారి ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆదివారం నాడు జరిగిన అమ్మవారి ఉత్సవంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు గారు, సభ్యులు బెండనకుప్పం బాబు, కన్నన్, మాజీ ఎంపీటీసీ కృష్ణన్, ముఖేష్ ,(అప్పు) ప్రమోద్, అర్ముగం, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ధర్మకర్తలు శివకుమార్, వెంకటేష్, రాజప్ప, కుప్పుస్వామి, ఆలయ కమిటి సభ్యులు, పూజారుల బృందం డాక్టర్ సురేష్ బాబు గారిని ఘనంగా సన్మానించి, ప్రతి సంవత్సరం ఉగాదికి ముందు అమ్మవారి ఇకారీ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, షికారి ఉత్సవం ముగిసిన మరుసటి నెలలో అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరుగుతోందని వివరించారు.

## రాష్ట్రస్థాయిలో....
# ఉత్తమ పంచాయతీ గా జాండ్ల

పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 03: అన్నమయ్య జిల్లా పీలేరు ఈనెల 5వ తేదీ ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి సమావేశమునకు ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైనట్లు పీలేరు మండలం జాండ్ల పంచాయతీ సర్పంచ్ నీలిమ తెలిపారు.



